ప్రజాశక్తి
గురువారం 6 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలోని 9వ తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. స్కాలర్ షిప్‌కు ఎంపికైన కొంచాడ జస్వంత్, కొప్పర తన్వీర్, పత్తిక అలేఖ్య, గంట భవ్యశ్రీకి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైసిపి ఓటమికి కారణాలెన్నో

- ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ముందు రుచించని సంక్షేమ పథకాలు
- నియోజకవర్గాల అభివృద్ధి విస్మరింపుతో వైసిపికి నష్టం
- ప్రజాగ్రహానికి గురిచేసిన ఎమ్మెల్యేల తీరు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో టిడిపి తిరుగులేని మెజార్టీ సాధించగా, వైసిపి ఘోర పరాభవానికి గురైంది. ఈసారి జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ టిడిపి ఎక్కువ చోట్ల విజయం సాధించవచ్చని చాలా మంది నోట తొలి నుంచీ వినిపించినప్పటికీ మరీ ఇంత దారుణంగా ఓడిపోతుందని ఎవరూ ఊహించలేదు. ఈ రెండు జిల్లాల్లోని 11 అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటంటే ఒక్క చోట కూడా గెలవకపోవడం, మంత్రులు సైతం కూటమి సునామీలో కొట్టుకుపోవడం చర్చనీయాశంగా మారింది. ఇందుకు గల కారణాలను విశ్లేషించుకుంటే టిడిపి, జనసేనపై అభిమానం కన్నా వైసిపి వైఫల్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు ఎమ్మెల్యేల పని తీరు, దీర్ఘకాలిక సమస్యలను పట్టించుకోకపోవడం, జిల్లా, నియోజకవర్గాల అభివృద్ధి గురించి ఏమాత్రమూ ఆలోచించకపోవడం వంటివి ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి. వీటికితోడు ఎన్నికల ప్రచారంలోని చివరి అంకంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేసిన ప్రచారం ముందు జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు రుచించలేదు. దాదాపు అన్ని చోట్లా టిడిపి గెలుపు, వైసిపి ఓటములను యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, వలస కుటుంబాలవారు ప్రధానంగా ప్రభావితం చేశారు.

ముఖ్యంగా చీపురుపల్లి నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి, మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అతి తక్కువ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉంటాయని చాలా మంది అంచనాలు వేసినప్పటికీ అక్కడ కూడా వైసిపి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న వ్యతిరేకత ఓటమి రుచి చూపించింది. టిడిపి అభ్యర్థి మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అతి తక్కువ సమయంలో బరిలోకి దిగినప్పటికీ విజయం సాధించారు.

గజపతినగరంలో వైసిపి ప్రభుత్వ వ్యతిరేకతకు, ఆపార్టీ అభ్యర్థి బొత్స అప్పలనర్సయ్య గడిచిన ఐదేళ్ల ప్రజల్ని, నాయకుల్ని ఖాతరు చేయకపోవడం, భూ ఆక్రమణలు చేశారనే ఆరోపణలు ప్రతికూలత సృష్టించాయి. ప్రభుత్వ వ్యతిరేతను, ఎమ్మెల్యేపట్ల ఉన్న అసంతృప్తి వాదులను కలుపుకోవడంలో టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సఫలీకృతులయ్యారు. దీనికితోడు శ్రీనివాస్ కొత్తగా రాజకీయాల్లోకి రావడంతో ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇవే ఆయన విజయానికి కారణమని చెప్పుకోవచ్చు. అప్పల నర్సయ్యకు కంచుకోటగావున్న దత్తిరాజేరు మండలంలో ప్రతి గ్రామంలోనూ 100 నుంచి 400 వందల ఓట్లు వరకు నష్టం జరిగింది. మిగిలిన మండలాల్లోనూ అదే పరిస్థితి.

నెల్లిమర్లలో జనసేన అభ్యర్థి లోకం మాదవి గెలుపు వెనుక టిడిపి పూర్తిస్థాయి సహకారం ఉంది. దీనికితోడు పూసపాటిరేగ లోని వైసిపికి చెందిన కొన్ని పంచాయతీల్లో ఓ వ్యక్తి కనుసన్నల్లో టిడిపికి ఎక్కువ ఓట్లు పడ్డాయనడంలో సందేహం లేదు. ఆమె ప్రత్యర్థి ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో భూములు, కొండలు ఆక్రమించు కున్నారన్న ప్రచారం కూడా జనసేన గెలుపునకు ఒక కారణంగా చెప్పుకోవచ్చు. దీనికితోడు గడిచిన ఐదేళ్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే సొంత పార్టీ నాయకులను పక్కనెబట్టి ఇతర పార్టీలకు చెందినవారు చెప్పిన విధంగా నడుచుకోవడంతో కొంత నష్టపోవాల్సి వచ్చింది.

బొబ్బిలిలో టిడిపికి తొలి నుంచీ సొంత బలం ఉంది. దీనికి అభ్యర్థి బేబీ నాయనకు వ్యక్తిగత చర్మిష్మా తోడైంది. మరోవైపు గత ఎన్నికల్లో శంబంగి, జగన్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ఇవన్నీ బేబీ నాయన గెలుపునకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ చిత్తుగా ఓడిపోతుందనుకున్న వైసిపి చివరి దశలో పుంజుకున్నట్టు చర్చ జరిగినప్పటికీ ఓటమి తప్పలేదు.

రాజాంలో వైసిపి ఎమ్మెల్యే కంబాల జోగులు గడిచిన ఐదేళ్లలో స్వంతత్రంగా పనిచేయ లేకపోవడం వల్ల క్రమంగా టిడిపి బలపడింది. దీనికితోడు టిడిపి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ గతంలో మంత్రిగా కొన్ని అభివృద్ధికార్యక్రమాలు చేపట్టడం, ఎన్నికల్లో వ్యూహాత్మక రాజకీయాలు చేయడం కలిసొచ్చే అంశాలు.

విజయనగరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కార్పొరేటర్లను పక్కనెబట్టి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏకచక్రాధితప్యం చలాయించడం పట్ల జనాల్లో కూడా వ్యతిరేకత వ్యక్తమైంది. కోలగట్లపై ఇలాంటి అసంతృప్తిని వ్యతిరేకంగా మార్చుడంలో టిడిపి వ్యూహాత్మక రాజకీయాలు చేసింది. టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు గతంలో ఓటమి చవి చూడడంతో ఈసారి కొంతమేర సానుభూతి కనిపించింది. ముఖ్యంగా నగరంలోని యువత టిడిపి, జనసేన తరపున పనిచేశాయి. వైసిపి అతినమ్మకం చివరి క్షణాల్లో టిడిపి తనకు అనుకూలంగా మార్చుకుంది.

పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం అసెంబ్లీ వైసిపి గెలుస్తుందని తొలి నుంచీ చర్చ నడిచినప్పటికీ, టిడిపిలోని గ్రూపు రాజకీయాలను అభ్యర్థి విజయ చంద్ర వ్యూహాత్మకంగా పక్కనబెట్టి, పార్టీ పునాదిని బలోపేతం చేసుకున్నారు. దీనికితోడు వైసిపి అభ్యర్థి దందాలు, దురుసుగా వ్యవహరించిన తీరు ప్రజలకు మింగుడు పడలేదు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన జనం ఎన్నికల్లో ఓటమి రుచిచూపించారు.

పాలకొండలో టిడిపి సహకారంతో జనసేన వచ్చే అవకాశం ఉందని తొలి నుంచీ చర్చసాగింది. అదే పార్టీలోని కొందరు నాయకులు వ్యవహారశైలితో గెలుపుపై అనుమానాలు వ్యక్తమైనప్పటికీ వైసిపి పట్ల ఉన్న వ్యతిరేకత, జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు కలిసి వచ్చింది. వైసిపి అభ్యర్థి గతంలో రెండుసార్లు గెలిచినప్పటికీ పెద్దగా అభివృద్ధి చేయకపోవడం, జయకృష్ణ గతంలో రెండుసార్లు టిడిపి తరపున ఓడిపోవడం కూడా జనసేన గెలుపునకు కారణమని చెప్పుకోవచ్చు.

సాలూరులో టిడిపిలో దీర్ఘకాలికంగా ఉన్న ముఠాలు, కుమ్ములాటలు ఈసారి పూర్తిగా తగ్గాయి. ముఠాలపట్ల అధిష్టానం కూడా ఓ కన్నేయడంతో ఆ మేరకు నష్టం తగ్గింది. టిడిపి అభ్యర్థి సంధ్యారాణి ఓసారి ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీసినప్పటికీ ఓడిపోవడంతో ఈసారి సానుభూతి పెరిగింది. ఇవన్నీ టిడిపి గెలుపునకు దోహదపడ్డాయి.

కురుపాంలో వైసిపి అభ్యర్థి పుష్పశ్రీవాణి ఏకపక్ష వైఖరి, సొంత పార్టీ నాయకులను, గిరిజనులను పట్టించుకోకపోవడం, సమస్యలపట్ల స్పందించకపోవడం, అభివృద్ధి చేయక పోవడం వంటి కారణాల వల్ల జనాల్లో వ్యతిరేకత పెరిగింది. దీనికితోడు టిడిపిలోని నాలుగు గ్రూపులు ఈసారి ఐక్యంగా పనిచేశాయి. దీంతో టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి స్థానిక గిరిజనురాలు అనే భావన ఎక్కువ మందిలో పాకింది. ఈనేపథ్యంలో పుష్పశ్రీవాణి ఓటమి తప్పదనే ఊహాగానాలు పోలింగ్‌కు ముందు నుంచే వినిపించాయి.

మంత్రులెవరు?

ఫలితాల వెల్లడితో ఆసక్తికరమైన చర్చ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మొన్నటి వరకు ఫలితాల ఉత్కంఠ.. అంతకు ముందు పోలింగ్‌పై ఆసక్తికరమైన రచ్చ.. ఇప్పుడు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మంత్రులెవరు? ఎవరికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయి? వారికి ఏ శాఖలు ఇచ్చే అవకాశం ఉంది? ఇదీ తాజాగా సాగుతున్న చర్చ. విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముగ్గురు సీనియర్లు ఉండగా, మరో నాలుగు చోట్ల కొత్త ముఖాలు ఉన్నాయి. ఇందులో జనసేన ఒకరు, మిగిలిన ముగ్గురూ రాజకీయ నేపథ్యం ఉన్నవారే. ఈ నేపథ్యంలో అధిష్టానం మంత్రి పదవులు ఎవరికి కట్టబెడుతుందో వేచిచూడాల్సిందే. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు గతంలో శ్రీకాకుళం జిల్లా కోటాలో అనేక దఫాలు మంత్రిగా పనిచేశారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి మోహన్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా సేవలందించారు. ఈ అనుభవంతో వీరు మరోసారి మంత్రి పదవులు ఆశించడం సహజం. సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ముచ్చటగా మూడోసారి గెలిచారు. ఆమె తాత కోళ్ల అప్పలనాయుడు కూడా టిడిపి ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా కూడా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురూ మంత్రి పదవుల రేసులో ఉన్నారు. మరోవైపు టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు మంత్రిగానే ఉన్నారు. మరోమాటలో చెప్పాలంటే ఆయన మంత్రిగా లేని చంద్రబాబు ప్రభుత్వాలు లేవనే చెప్పుకోవచ్చు. 2014 ఎన్నికల్లో ఎంపిగా గెలవడంతో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పదవిని కట్టబెట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన పోటీలో లేనప్పటికీ ఆయన వారసురాలిగా అదితి విజయలక్ష్మి గజపతిరాజు విజయనగరం అసెంబ్లీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. జిల్లాలో మరెవరికీ లేనంతగా 60,609 ఓట్ల మెజార్టీ కూడా వచ్చింది. ఈనేపథ్యంలో అశోక్, చంద్రబాబు సన్నిహితం, మిత్రబంధం, చరిష్మా అదితికి అనుకూలంగా మారుతాయా? లేదా? అన్నది వేచిచూడాల్సిందే. ఒకవేళ అదితికి అవకాశం లేకపోతే బేబినాయన పేరు తప్పక పరిశీలనలో ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అటు కళావెంకటరావు చాలా సార్లు మంత్రిగా పనిచేసిన నేపథ్యంలో మరోసారి మంత్రి పదవి కట్టబెట్టి ఆయన అనుభవాన్ని ఉపయోగించుకుంటారా? లేక ఈసారి కొత్తవారికి ఇవ్వాలనే ఉద్దేశంతో పక్కనబెడతారా? అన్న చర్చసాగుతోంది. ఇక మురళీమోహన్‌కు సామాజిక తరగతి కోటాలో వస్తేరావచ్చు.. అంటూ ప్రచారం జరుగుతోంది. లలితకుమారి మంత్రి రేసులో ఉన్నట్టుగా బోగట్టా.



వాస్తవానికి టిక్కెట్ల కేటాయింపు మొదలుకుని పార్టీ పదవుల వరకు ఇటీవల కాలంలో యువతను ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఇదే పరిస్థితి కొనసాగితే గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ పేరు తప్పక పరిశీలనకు వెళ్తుందని విశ్లేషకుల అంచనా. జనసేన కోటాలో విజయనగరం నుంచి మంత్రి పదవి కేటాయిస్తే నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవిని మంత్రి పదవి వరించినట్టే. ఇవన్నీ స్థానిక పరిస్థితులు మాత్రమే. వాస్తవానికి విజయనగరం జిల్లాకు ప్రతిసారి రెండు మంత్రి పదవులు కేటాయించేవారు. ఇందులో జిల్లాను నడిపించే నాయకత్వం, సామాజిక న్యాయం పాటించేవారు. ఈసారి ఏ అంశాల ప్రాతిపదికన మంత్రి పదవులు కేటాయిస్తారో వేచిచూడాల్సిందే.

అటు పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక మంత్రి పదవి ఖాయమని చెప్పుకోవచ్చు. అది కూడా గత ప్రభుత్వం మాదిరిగా గిరిజన సంక్షేమ శాఖ ఇవ్వవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో గిరిజన ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో సీనియర్‌గా ఉన్న గుమ్మడి సంధ్యారాణికే అవకాశం రావచ్చనే చర్చ నడుస్తోంది.

పోస్టల్ బ్యాలెట్‌లో సైకిల్‌దే హవా

వైసిపిపై తీవ్ర వ్యతిరేకత కనబర్చిన ఉద్యోగులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పోస్టల్ బ్యాలెట్‌లోనూ సైకిల్ హవా కొనసాగింది. విజయనగరం పార్లమెంటులోనూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా టిడిపికే పడ్డాయి. అరకు పార్లమెంట్ ఫలితం మాత్రం ఇందుకు మినహాయింపుగా చెప్పుకోవచ్చు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులకు, జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించిన విషయం విదితమే. ఈ ఓటర్లు దాదాపు అన్ని చోట్లా టిడిపికే మొగ్గుచూపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని మొత్తం 11 అసెంబ్లీ స్థానాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని ఒక్కసారి పరిశీలిస్తే... విజయనగరం అసెంబ్లీ స్థానంలో 4,892 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవ్వగా ఇందులో అత్యధికంగా టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు 3,433 ఓట్లు పడ్డాయి. వైసిపికి 1282, స్వతంత్ర అభ్యర్థి మీసాల గీతకు 93 చొప్పున ఓట్లు పడ్డాయి. బొబ్బిలిలో 3147 ఓట్లకు గాను 2,255 ఓట్లు టిడిపికి పోలవ్వగా, వైసిపికి కేవలం 843 ఓట్లు పడ్డాయి. గజపతినగరంలో పోలైన 2,620 పోస్టల్ బ్యాలెట్లకుగాను టిడిపికి 1,738 ఓట్లు, వైసిపికి 836 ఓట్లు పడ్డాయి. రాజాంలో 3,255 ఓట్లకు గాను టిడిపికి 2,280, వైసిపికి 911 ఓట్లు పడ్డాయి. చీపురుపల్లిలో పోలైన 1975 ఓట్లలో 1142 ఓట్లు టిడిపికి, 911 ఓట్లు వైసిపికి వెళ్లాయి. నెల్లిమర్లలో 2,355 ఓట్లకు గాను జనసేనకు 1,596, వైసిపికి 677 చొప్పున ఓట్లు పడ్డాయి. ఎస్.కోటలో 2,848 ఓట్లకు గాను టిడిపికి, 1,916 వైసిపికి 851 ఓట్లు చొప్పున పడ్డాయి. విజయనగరం పార్లమెంట్ పరిధిలో మొత్తంగా 20,532 పోస్టల్ బ్యాలెట్లు పోలవ్వగా ఇందులో అత్యధికంగా 13,829 ఓట్లు టిడిపికి పడ్డాయి. ఆ తరువాత స్థానంలో వైసిపికి కేవలం 6,071 ఓట్లు మాత్రమే రావడం విశేషం.

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,850 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఇందులో టిడిపికి 1917 ఓట్లు రాగా, వైసిపికి కేవలం 873 మాత్రమే పడ్డాయి. పాలకొండలో 2,785 ఓట్లు పోలవ్వగా, జనసేనకు 1857 ఓట్లు, వైసిపికి 807 ఓట్లు పడ్డాయి. కురుపాంలో 2,846 ఓట్లకు గాను టిడిపికి 2,169 ఓట్లు పడగా, వైసిపికి కేవలం 595 ఓట్లు మాత్రమే పడ్డాయి. సాలూరులో 2,031 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకుగాను టిడిపికి 1,339, వైసిపికి 664 ఓట్లు చొప్పున వచ్చాయి. సాధారణంగా ఉద్యోగులు, జర్నలిస్టులు స్పష్టమైన రాజకీయ వైఖరితో ఉంటారనడంలో సందేహం లేదు. ముఖ్యంగా కుటుంబాల జీవనోపాధిలో ఉద్యోగులు కీలకంగానే ఉంటారు. ఈ నేపథ్యంలో వీరి కుటుంబాలను కూడా టిడిపి వైపు మళ్లించేందుకు అవకాశం ఉంటుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు జగదీశ్వరి, విజయ్‌చంద్రకు అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

జగదీశ్వరికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తొలిసారి కురుపాం ఎమ్మెల్యేగా గెలుపొందిన తోయక జగదీశ్వరికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు, బంధువులు బుధవారం ఉదయం పెద్దసంఖ్యలో గుమ్మలక్ష్మీపురం వచ్చి అభినందనలు తెలిపారు. ఐదు మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో కోలాహలం నెలకొంది. స్వీట్లు తినిపిస్తూ దుస్సాలువాతో సత్కరించారు. మంచి పాలన అందిస్తూ , ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఏజెన్సీ ప్రెస్ క్లబ్ అభినందనలు

కొత్తగా ఎన్నికైన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, బేత కుమారస్వామి అభినందనలు తెలిపారు. దీర్ఘకాలికంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు తూలుగు రవికుమార్, శంకర్రావు ఉన్నారు.

బోనెల విజయ్ చంద్రకూ..

పార్వతీపురం రూరల్ : స్థానిక ఎమ్మెల్యేగా గెలుపొందిన బోనెల విజయచంద్రకు అభినందనలు తెలిపేందుకు అభిమానులు, కార్యకర్తలు పోటెత్తారు. బుధవారం ఉదయం వైకెఎం కాలనీలో గల ఆయన నివాసానికి బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల నుంచి కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు, జనసేన, బిజెపి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గ్రామాల వారీగా నాయకులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల గ్రామాలకు చెందిన సీనియర్ నాయకులను సమన్వయం చేసుకుంటూ కార్యకర్తలు సహకారంతో పార్టీని ముందుకు నడిపి స్తానని అన్నారు. అలాగే నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

మలాథియన్ స్ప్రేయింగ్‌ను పరిశీలించిన డిఎంఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని చందలంగి, బట్టివలసలో దోమల నివారణ మందు పిచికారీ (ఐఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు బుధవారం పరిశీలించారు. ప్రతి ఇంటికీ స్ప్రేయింగ్ సక్రమంగా చేపడుతున్నదీ, లేనిదీ స్వయంగా తనిఖీ చేశారు. దోమల మందు ఎసిఎం రసాయనం వినియోగించిన మోతాదు, గ్రామంలో ఇళ్ల సంఖ్య తదితర వివరాలపై ఆరా తీశారు. మార్కింగ్ వేసిన ఇళ్లకు స్ప్రే జరిగిన తీరును గమనించారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ గత నెల 15 నుంచి మొదటి విడత స్ప్రేయింగ్ దోమల నివారణ చర్యలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జరుగుతుందని, పార్వతీపురం మండలంలో 36 గ్రామాలకు గానూ ఇప్పటికి 26 గ్రామాల్లో స్ప్రేయింగ్ పూర్తయ్యిందని తెలిపారు. వీటితో పాటు డ్రైడే కార్యక్రమాలు, ఫీవర్ సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్లు, శానిటేషన్ డ్రైవ్ మొదలగు దోమల నివారణ చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలను సకాలంలో గుర్తించడంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి.ధరణి, కార్యాలయ డెమో యోగీశ్వరరెడ్డి, ఇఒ వెంకటనాయుడు, సత్తిబాబు, సూపర్వైజర్లు శంకర్రావు, జయలక్ష్మి, ఎంటిఎస్ రామకష్ణ, వైద్య సిబ్బంది బంగారినాయుడు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఉన్న విత్తనాలు

ఖరీఫ్ ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

ఖరీఫ్‌లో పంట వేసేందుకు రైతులు పొలాలను దున్నుతూ సిద్ధం చేస్తున్నారు. మృగశిర కార్తి దగ్గర పడడంతో రైతులు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సీజన్‌కు వరి విత్తనాలు అన్ని ఆర్‌బికెల వద్దే రైతాంగానికి అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు వేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని 17 వేల హెక్టర్ల విస్తీర్ణంలో వరి పంట వేసేందుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఎంపి 10 0 6 4 రకం వరి విత్తనాలు 686 క్వింటాలు, ఎంటియు 11 21 రకం 322, ఆర్‌జిఎల్ 5237 రకం 34 కింటాళ్ళు, 5204 రకం 79 కింటాళ్ళు, 3271 సోనా మసూరి 253 కింటాళ్ళు, స్వర్ణ మసూరు 7029 రకం 36 కింటాళ్లు ఇప్పటికే సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రకాలన్నీ రైతులకు కేజీకి రూ.10 చొప్పున సబ్సిడీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అలాగే పచ్చి రొట్టవిత్తనాలైన జీలుగా, పిల్లి పెసర, కట్టెజనుములు వంటివి రైతులకు సబ్సిడీపై అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు యూరియా, పురుగు మందులు, డిఎపి కూడా ఆయా కేంద్రాల ద్వారా ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సంధ్యారాణి శ్రమకు తగిన ఫలితం

- పాతికేళ్ల నిరీక్షణ తర్వాత
- టిడిపి శ్రేణుల్లో నూతనోత్సాహం

ప్రజాశక్తి - సాలూరు

ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి శ్రమకు తగిన ఫలితం దక్కింది. 1999లో కాంగ్రెస్ పార్టీతో మొదలైన ఆమె రాజకీయ ప్రస్థానం టిడిపిలో ఒక స్థాయికి చేరారు. నియోజకవర్గ రాజకీయాల్లో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ఆమె ముందుకు సాగారు. తొలిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున ఆమె పోటీ చేసి అప్పటి టిడిపి అభ్యర్థి భంజ్ దేవ్ చేతిలో ఓడిపోయారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకురాలిగా ఉంటూ ఎమ్మెల్యే సీటు కోసం ప్రయత్నించారు. అయితే అప్పటికే రాజన్నదొర కాంగ్రెస్‌లో ఉండడం తో ఆమెకు అదృష్టం కలిసి రాలేదు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో ఆమె ఆఖరి నిమిషంలో టిడిపిలో చేరి సీటు సాధించుకున్నారు. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాజన్నదొరపై ఓటమి పాలయ్యారు. 2014లో టిడిపి అభ్యర్థిగా భంజ్ దేవ్ పోటీ చేయడంతో ఆమెకు పార్టీ అధిష్టానం అరుకు ఎంపీ అభ్యర్థిగా టికెట్ ఖరారు చేసింది. ఎంపీగా పోటీ చేసి ఓడిపోవడంతో అప్పుడు అధికారంలోకి వచ్చిన టిడిపి ఆమెను ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది. ఆరేళ్ల పాటు ఆమె ఎమ్మెల్సీగా పని చేశారు. 2019 ఎన్నికల్లోనూ టిడిపి సీటు దక్కలేదు. అయినా నిరాశ చెందకుండా పార్టీలో కొనసాగడంతో అధిష్ఠానం ఆమెకు పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమించింది. ఈసారి ఎన్నికల్లో టిడిపి సీటు సాధించుకుని మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. నియోజకవర్గంలోని పట్టణ ఓటర్లు ఆమెకు అండగా నిలబడడంతో ఆమె గెలుపు సునాయాసమైంది. దాదాపు పాతికేళ్ల నిరీక్షణ తర్వాత ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆమె కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. అరుకు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎస్టీ నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలందరిలో ఆమె సీనియర్ నాయకురాలు కావడం, ఎమ్మెల్సీగా అనుభవం ఉండడంతో రానున్న ప్రభుత్వంలో ఆమె కీలకపాత్ర పోషించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో ఆమె గెలుపు నూతనోత్సాహాన్ని నింపింది. రెండు దశాబ్దాల పాటు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరక పోవడంతో నిరాశ, నిస్పృహ ల్లో ఉన్న నాయకులకు, కార్యకర్తలకు తాజా విజయం కొండంత బలాన్ని ఇచ్చినట్లయింది.

తొలి మహిళా ఎమ్మెల్యే సంధ్యారాణి

నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో గుమ్మడి సంధ్యారాణి తొలి మహిళా ఎమ్మెల్యే కావడం విశేషం. నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుండి ఇంతవరకు మహిళలు ఎవరూ ఎమ్మెల్యే గా ఎన్నిక కాలేదు. ఆమె ఆస్ట్రేలియాలో కొంత కాలం ఉద్యోగం చేసి 1999 ఎన్నికల్లో పోటీ కోసం ఇక్కడకి వచ్చారు. ఆమె భర్త జయకుమార్ సాఫ్ట్వేర్ రంగంలో స్థిరపడ్డారు. ఆమె డిగ్రీ వరకు చదువుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జన్ని ముత్యాలు కుమార్తె అయిన సంధ్యారాణి కి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సంధ్యారాణిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

పాలకొండలో కురుస్తున్న వర్షం

పలుచోట్ల భారీ వర్షాలు

ప్రజాశక్తి - సీతంపేట/పాలకొండ

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. సీతంపేట మండలంలోని బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం ఏకధాటిగా కురిింది. ఇప్పటి వరకు ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ వర్షం భారీగా కురవడంతో వేడిమి నుంచి ప్రజలకు కొంత ఉపశమనం ఉంది. ఈ వర్షంతో గెడ్డల్లో నీరు పరుగులు తీస్తోంది. అంతేకాక రైతులకు ఖరీఫ్ పంటలకు మేలు చేకూరుతుంది.

పాలకొండలో బుధవారం మధ్యాహ్నం సుమారు గంటపాటు కుండపోత వర్షం కురిసింది. కొద్దిరోజులుగా వేసవి తాపానికి విలవిలలాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రజలు కొంత ఆందోళనకు గురైయ్యారు. ఈ వర్షం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని హర్షం వ్యక్తం చేశారు.

రవికుమార్‌ను సత్కరిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూదేవి

కింజరాపు, కూనను కలిసిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - పాలకొండ

ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును, శ్రీకాకుళం ఎంపీగా భారీ మెజారిటీతో గెలిచిన రామ్మోహన్ నాయుడును, ఆమదాలవలస ఎమ్మెల్యేగా గెలిచిన కూన రవికుమార్‌ను వారి నివాసల వద్ద టిడిపి శ్రేణులు అభినందనలు తెలిపాయి. పార్టీకి అండగా ఉంటామని, మరింత చురుగ్గా పనిచేయాలని నేతలు టిడిపి శ్రేణులకు సూచించారు. నాయకులను కలిసినవారిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి, సామంతుల దామోదర్ రావు, గుమ్మిడి సింహాద్రి, వారాడ సుమంత్ నాయుడు, కండాపు వెంకటరమణ, ఎస్.సర్వారాపు ఉన్నారు.

చిన్నారులకు నృత్య పోటీలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి ఆధ్వర్యాన పిల్లలకు డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి ముగింపు రోజు (ఈనెల 7న) బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గ్రంథాలయ వేసవి శిబిరాలు పట్ల విద్యార్థులు ఎంతగానో ఆసక్తి చూపిస్తున్నారని స్థానిక లైబ్రరియన్ సుకన్య తెలిపారు. వేసవి శిబిరాల్లో భాగంగా విద్యార్థులచే బుధవారం పుస్తక పఠనం చేయించామన్నారు. ప్రతి విద్యార్థి చదువు పట్ల ఆసక్తి కనబరిచి బడిబాట పట్టేందుకు వేసవి శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, పాటలు నేర్పిస్తున్నామని ఆమె చెప్పారు.



వీరేష్‌ను సత్కరిస్తున్న టిడిపి కార్యకర్త

వీరేష్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి టి.జగదీశ్వరి గెలుపులో కీలకపాత్ర పోషించిన రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్ర దేవ్‌ను ఐదుమండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. నియోజకవర్గంలోని గ్రూపులను కలిపి మూడు దశాబ్దాల తర్వాత కురుపాం నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగర వేయించడం కృషి చేశారు. దీంతో ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్చాలు ఇచ్చి సన్మానాలతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల ప్రజలకు టిడిపి అభినందనలు

గరుగుబిల్లి: కురుపాం ఎమ్మెల్యేగా తోయక జగదీశ్వరి ఘనవిజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు ధన్యవాదాలు తెలిపారు. జగదీశ్వరి విజయంలో కీలక పాత్ర పోషించిన, మండల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, జనసేన, బిజెపికార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేద్దామన్నారు.

లోకేష్‌ను కలిసిన కోలా రంజిత్

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను బుధవారం మంగళగిరిలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా కూటమి విజయ దుందుభి మోగించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపామన్నారు.

లోకేష్‌కు బొకేను అందజేస్తున్న రంజిత్

టిడిపి నాయకుల సంబరాలు

భామిని : పాలకొండ జనసేన ఎంఎల్ఎ నిమ్మక జయకృష్ణ గెలుపొందిన నేపథ్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఉమ్మడి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శు రవినాయుడు, మెడిబోయిన జగదీశ్వరరావు మాట్లాడుతూ జయకృష్ణ గెలుపునకు పూర్తి స్థాయిలో శ్రమించిన నాయకులకు, కార్యకర్తలు ధన్యవాదాలు కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డికి ప్రసాద్, లోపింటి రాజేష్, గురిబిల్లి లక్ష్మి పతి,పొట్నూరు నాగేశ్వరరావు, బిడ్డికి విష్ణు, సాకేటి రామారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మండల టిడిపి నాయకులు

శ్రీవాణి ఓటమికి కారణాలివే..

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అనతి కాలంలోనే ఉన్నత పదవులకు వెళ్లిన మాజీఎమ్మెల్యే పుష్ప-శ్రీవాణి, అదే స్థాయిలో పదవికి దూరం కావడంతో పాటు ఒక సామాన్య మహిళ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. ఇందుకు అనేక కారణాలు వినిపిస్తున్నప్పటికీ అందులో ఆమె వైఖరే ప్రధానమైనదని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. శత్రుచర్ల కుటుంబానికి చెందిన కోడలుగా గుర్తిస్తూ పుష్ప శ్రీవాణిని 2014, 2019లో రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు గెలిపించారు. డిప్యూటీ సీఎంగా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. అయితే ఈమె పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి, కోట్ల కుమ్మరించుకోవడమే పనిగా పాలన సాగించారని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యలను చెప్పుకునేందుకు గిరిజన ప్రజలు చినమేరంగి కోటకు వెళ్తే గంటల తరబడి నిరీక్షించాలే తప్ప కోట బయటకు వచ్చేవారు కాదనే అపవాదం కూడా ఉంది. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తీర్మానాన్ని వ్యతిరేకించకపోవడం, జిఒ 3 రద్దయిన కనీసం స్పందించకపోవడం, సవర భాష వాలంటీర్ల సమస్యలను పట్టించుకోకపోవడం, ఉద్యోగ, ఉపాధి లేక గిరిజనులు వలసపోతున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నివారణా చర్యలు తీసుకోకపోవడం, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మరణాలు జరుగుతున్న స్పందించకపోవడం, గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో అడవి ఏనుగుల సమస్య ఉన్నా పరిష్కరించక పోవడం, పూర్ణపాడు- లాబేసు వంతెన పూర్తి చేయకపోవడం, సాగు నీటి ప్రాజెక్టులపై దృష్టి సారించకపోవడం ఇలా ఎన్నో సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రజల నుంచి ఎన్నో ఆరోపణలు వినిపించాయి. రెండుసార్లు గెలిపించిన నియోజకవర్గ ప్రజలు మూడోసారి కూడా గెలిపిస్తారనే అతివిశ్వాసం బెడిసి కొట్టింది.

జియ్యమ్మవలస : ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఆమె అనేక కీలక పదవులు చేపట్టిన తర్వాత తనను నమ్ముకున్న కార్యకర్తలను దూరం పెట్టారని, నియోజకవర్గంలో జరుగుతున్న విషయాలపై ఎవరు ఏ సూచనలు, సలహాలు ఇచ్చినా వాటిని స్వీకరించరని, టిడిపిని వీడి వైసిపిలో చేరిన వారికి సైతం విలువ ఇవ్వడంలేదని, తమ వెంటే ఉంటున్న భజన పరులకు తప్ప ఇంకెవరినీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా లేకపోలేదు. అంతేకాక గ్రామాల్లో సరైన నాయకత్వం లేకుండా అంతా వాలంటీర్లను నమ్ముకోవడం కూడా వైసిపి ఓటమికి కారణమని అంటున్నారు. ఏది ఏమైనా గత ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలోని వైసిపికి ఏదైతే 25వేల ఓట్ల పైచిలుక మెజారిటీతో గెలుపొందారో, అదే తరహాలో తెలుగుదేశం అభ్యర్థి తోయకు జగదీశ్వరి గెలుపొందారు. ఈ ఎన్నికతో చినమేరంగి కోట నుండి ఎమ్మెల్యే పదవి చేజారడం నమ్మలేని నిజమని నియోజకవర్గం ప్రజలు అంటున్నారు.

రాజుల పాలనకు చమర గీతం

గుమ్మలక్ష్మీపురం : ప్రజలు మార్పు కోరారు.. విజయీభవ అంటూ జగదీశ్వరీని ఆశీర్వదించారు. ఆశీర్వాద బలమే కొండంత అండై ఆమె గెలుపునకు కారణమైంది. కురుపాం నియోజకవర్గం చరిత్రలో టిడిపి రెండోసారి విజయఢంకా మోగించింది. చిన మేరంగికోటను బద్దలకొట్టి 2024 సాధారణ ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీకి చెందిన గిరిజన మహిళ తోయక జగదీశ్వరి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రత్యర్థి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణిపై 23,500ఓట్లతో ఘన విజయం సాధించారు. ఎల్విన్‌పేట ఎంపిటిసి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఆమె ఎదగడం చూస్తే ప్రజలు ఆమెను ఎంతగా ఆదరించారో అర్థం చేసుకోవచ్చు. ఇన్చార్జి పదవి ఇచ్చిన నాటి నుంచి కురుపాం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసి పూర్వవైభవం తీసుకొచ్చారు. దీనికి తోడు శత్రుచర్ల విజయరామరాజు ఆశీర్వాదం, ఎమ్మెల్యే టికెట్ సాధించుకున్నారు. మరోవైపు చివరి నిమిషంలో కురుపాం కోటకు చెందిన వైరి చర్ల వీరేష్ దేవ్ సహకారం తోడైంది. ఐదేళ్ల వైసిపి పాలనలో ఎటువంటి అభివృద్ధి లేకపోవడం, గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి చూపకపోవడం, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొం దిన పాముల శ్రీవాణి ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం, ఆమెలో అహంకార ధోరణిని గుర్తించిన ప్రజలు విసుగు చెందిన మార్పు కోరుతూ జగదీశ్వరికి ఎమ్మెల్యే పట్టం కట్టారు.

57 ఏళ్లలో రెండోసారి విజయం నమోదు

ఒకప్పటి నాగూరు నేటి కురుపాం 57 ఏళ్ల నియోజకవర్గ చరిత్రలో 20 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి రెండుసార్లు విజయం సాధించింది. 1994లో టిడిపి అభ్యర్థి నిమ్మక జయరాజు ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి అయినా చిన మేరంగి కోటకు చెందిన శత్రుచర్ల చంద్రశేఖర్ రాజుపై 32,271 ఓట్లు మెజార్టీతో ఘన విజయం సాధించారు. సరిగ్గా 30 ఏళ్ల తర్వాత కురుపాంలో టిడిపి విజయం సాధించడం విశేషం. ఆనాడు గిరిజన ప్రజలు జయరాజును ఏ విధంగా ఆదరించారో అదే విధంగా నేడు జగదీశ్వరిని కూడా గెలిపించారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాజన్నదొర ; విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే జోగారావు

రాజన్నదొర కొంప ముంచిన పట్టణ ఓటర్లు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో వైసిపి అభ్యర్థి రాజన్నదొరకు పట్టణ ఓటర్లు గట్టి ఝలక్ ఇచ్చారు. పట్టణంలో సుమారు పదివేల ఓట్ల ఆధిక్యత టిడిపికి రావడం ఆయన ఊహకందని పరిణామంగా దాపురించింది. పట్టణంలో వైసిపికి బలమైన యంత్రాంగం వుంది. మున్సిపాలిటీలో 20మంది కౌన్సిలర్లు వున్నారు. అయినా టిడిపి ఆధిక్యత కనబర్చడం వెనుక వైసిపి నాయకులు, కార్యకర్తల్లో గూడుకట్టుకున్న తీవ్ర అసంతృప్తే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మున్సిపాలిటీ వైసిపి అధీనంలో వున్నప్పటికీ సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడంతో పురపాలన గాడి తప్పింది. పట్టణంలో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు పుష్కలంగా ఉన్నా పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. చాలా వరకు పనులకు శంకుస్థాపనలు చేసి వదిలేయడం, మున్సిపల్ పాలనా వ్యవహారాలపై డిప్యూటీ సిఎం రాజన్నదొర దృష్టి సారించకపోవడం ఆయన పట్ల వ్యతిరేకతను పెంచినట్లు తెలుస్తోంది. గత రెండు దశాబ్దాలుగా పట్టణ ఓటర్లు టిడిపికి ఆధిక్యత ఇస్తున్నారు. ఈసారి కూడా టిడిపి కి ఆధిక్యత వస్తుందనే ప్రచారం జరిగింది. కానీ అనూహ్య రీతిలో ఆధిక్యత లభించడానికి కారణం పట్టణ వైసిపి నాయకులు చిత్తశుద్ధితో పని చేయలేదనే ఆరోపణలు వచ్చాయి. ఇదే పరిస్థితి మిగిలిన మండలాల్లోనూ కనిపించింది. ఎన్నికలకు ఒకటి రెండు రోజుల ముందు ఓట్లు కొనుగోలు కోసం నాయకులకు ఇచ్చిన డబ్బులు ఓటర్లకు చేరకపోవడం, చేరినా టిడిపి ఇచ్చిన దాని కంటే తక్కువ పంపిణీ చేయడం ప్రతికూల ప్రభావం చూపించినట్లు తెలుస్తోంది.

కస్పా వీధిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని రెండో సచివాలయం పరిధిలో గల కస్పా వీధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఆడపాదడప కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని కాచిన నీరు తాగాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి.కావ్య, ఎఎన్ఎం జానకి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటా : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏమాత్రం అధైర్య పడొద్దని మాజీ మంత్రి రాజన్నదొర అన్నారు. ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న కార్యకర్తలు, నాయకులు నియోజకవర్గ నలుమూలల నుంచి ఆయన నివాసానికి చేరుకున్నారు. వారి నుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసిపికి ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తామని, టిడిపి ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తే సహకరిస్తామని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటానికి సిద్ధంగా వున్నట్లు చెప్పారు. వాస్తవంగా ఈ ఎన్నికల్లో తనకు ఎంపీ సీటు కావాలని పార్టీ అధిష్టానాన్ని కోరారని, ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అధినాయకత్వం ఆదేశించిందని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నడూ ప్రతిపక్ష పార్టీ నాయకులను, కార్యకర్తలను వేధింపులకు గురి చేయలేదని, కొంతమంది తనతో పనులు కూడా చేయించుకున్నారని చెప్పారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన వెంటనే కొంతమంది టిడిపి నాయకులు తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను బెదిరిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఎలాంటి బెదిరింపులకు భయపడొద్దని, ఎల్లవేళలా తాను అందుబాటులో వుంటానన్నారు. ఐదేళ్ల తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని రాజన్నదొర చెప్పారు. ఈ సమావేశంలో సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలబడతా

పార్వతీపురంరూరల్ : అధికారం ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం ఎన్నికల ఫలితాల తర్వాత అతని క్యాంపు కార్యాలయంలో పరామర్శించడానికి వచ్చిన వివిధ మండలాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తనకు వెన్నంటి నిలిచి తనతో నడిచిన ప్రతి వైసిపి నాయకుడికి, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే కాలంలో కూడా వారికి అండగా నిలిచి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ప్రజా తీర్పునకు కట్టుబడుతూ కొత్తగా ఎన్నికైన నలుగురు ఎమ్మెల్యేతో పాటు ఎంపిగా ఎన్నికైన తనూజరాణికి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎవరికీ ఏ ఇబ్బంది కలిగినా, ఏ సమస్య పరిష్కారానికైనా తన వంతుగా కృషి చేస్తానన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఎంపిపి మజ్జి శోభారాణి, సీనియర్ నాయకులు పోల సత్యనారాయణ, వైస్ ఎంపిపి సిద్దా జగన్నాథరావు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండకు కొత్త జెండా

ప్రజాశక్తి - పాలకొండ

2024 సార్వత్రిక ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా జనసేన తరపున నిమ్మక జయకృష్ణ గెలవడంతో నియోజకవర్గంలో కొత్త పార్టీ జెండా రెపరెపలాడిందని చెప్పవచ్చు. ఇంతవరకు కాంగ్రెస్, స్వతంత్ర పార్టీ, జనతాపార్టీ, టిడిపి, వైసిపి జెండాలు నియోజకవర్గంలో ఎగరగా ఈసారి జనసేన జెండా ఎగిరింది. 1952లో పాలకొండ నియోజకవర్గం ఆవిర్భవించగా పాలవలస సంఘున్నాయుడు కాంగ్రెస్ తరపున గెలుపొందగా, పైడి నరసింహప్పరావు స్వతంత్ర అభ్యర్థిగా 1955లో విజయం సాధించారు. 1962లో కెంబూరు సూర్యనారాయణ నాయుడు స్వతంత్ర పార్టీ ఎమ్మెల్యేగా గెలిచారు. 1966లో స్వతంత్ర పార్టీ ఎమ్మెల్యేగా జోజీ, 1972 లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొత్తపల్లి నరసయ్య, 1978లో జనతా పార్టీ నుంచి కంబాల రాజారత్నం, 1983లో టిడిపి ఆవిర్భావం తర్వాత 1983లో శ్యామలరావు, 1985, 1994లో తలే భద్రయ్య, 2004లో కంబాల జోగులు టిడిపి తరపున గెలిచారు. 1989లో అమృతకుమారి, 2009లో నిమ్మక సుగ్రీవులు కాంగ్రెస్ తరపున గెలుపొందారు. 1999లో అమృతకుమారినే ఇండిపెండెంట్‌గా గెలుపొందడం విశేషం. వైసీపీ ఆవిర్భావం తర్వాత 2014, 2019లో ఆ పార్టీ తరపున విశ్వసరాయి కళావతి గెలుపొందారు. ఇప్పుడు జనసేన తరపున నిమ్మక జయకృష్ణ గెలుపొంది పాలకొండ నియోజకవర్గానికి కొత్త జెండా తీసుకుని వచ్చారని చెప్పుకోవచ్చు.

7,8, 9 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ములక్కాయ వలస మోడల్ పాఠశాలలో 7,8, 9 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ స్వర్ణలత తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పాఠశాలలో దరఖాస్తులు లభించనున్నాయన్నారు. ఈనెల 7లోగా వాటిని సమర్పించాలని ఆమె తెలిపారు. అలాగే దరఖాస్తులు ఇచ్చిన విద్యార్థులకు ఈ నెల 10న అర్హత పరీక్ష ఉంటుందని ఆమె వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు ఆక్రమించి కంచె వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతర అధికారులు తమకేమీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. బెలగాం శివారులో 19వ వార్డులో గల గెడ్డవీధి ముందర ప్రధాన రహదారిగా ఆనుకుని ఉన్న మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు పాడు పడిపోయిన బడ్డీలను పెట్టి స్థలం చుట్టూ సిమెంట్ స్తంభాలు పాతి ఇనుప కంచె వేసి ఆక్రమిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు కనీసం పర్యవేక్షణ చేయకపోవడం ఆ ఆక్రమణలు తొలగించకుండా, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలేదు. అంతేకాక ప్రలోభాలకు లోబడి మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి ఆక్రమణ తొలగించి మున్సిపల్ ఆస్తులు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమించిన స్థలం చుట్టూ వేసిన కంచె

పర్యావరణంతోనే భావితరాలకు భవిష్యత్తు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పర్యావరణంతోనే భావితరాల ఉజ్వల భవిష్యత్తును కాపాడుదామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సౌందర్య నారాయణమూర్తి నగర్ పార్క్‌లో కమిషనర్ ఎస్ఎన్ఎం కాలనీ పెద్దలతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మనమంతా కలిసి పర్యావరణాన్ని రాబోయే తరాల కోసం కాపాడుకుందామని, స్వచ్ఛమైన గాలి, నీరు అన్ని జీవులకు ఉజ్వల భవిష్యత్తు కోసం తప్పకుండా పర్యావరణాన్ని రక్షించుకోవాలని అన్నారు. ఎస్ఎన్ఎం నగర్ పార్క్ అభివృద్ధికి నిధులను కేటాయిస్తామని తెలుపుతూ పట్టణంలో మెయిన్ రోడ్డులో షాపులు ఉన్న వ్యాపారస్తులు తమ షాప్ ముందు డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని వాటిని సేకరించేందుకు వచ్చిన మున్సిపల్ చెత్త సేకరణ వాహనం వచ్చిన వెంటనే మెయిన్ రోడ్డులో ఉన్న వ్యాపారస్తులు తప్పకుండా డస్ట్ బిన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. లేకుంటే జరిమానా వేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ కిరణ్, సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, ఎస్ఎన్ఎం నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

మక్కువ : ప్రపంచ పర్యావరణం దినోత్సవం పురస్కరించుకొని మండల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారాయణరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. బుధవారం బాగు జల ఒడిసెల మెట్ట ప్రజలు ఫారెస్ట్ ప్రాంతాల్లో సుమారు 2500 మొక్కలు నాటినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : జట్టు ఆశ్రమ వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలో తోటపల్లి జట్టు ట్రస్ట్ వద్ద పర్యావరణ దినోత్సవం సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ డి. పారినాయుడు ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు పర్యావరణంలో పెరుగుతున్న కాలుష్యానికి నిదర్శనమని, కావున పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.ప్లాస్టిక్ వాడకాలు వాడరాదని, అధిక దిగుబడులు సాధనకు రసాయన ఎరువులు వాడరాదని కోరారు. వ్యవసాయ జిల్లా ప్రభందకులు పి షణ్ముఖరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని అన్నారు. కార్యక్ర మంలో జట్టు ట్రస్ట్ డి ప్రహరాజ్, ఆర్ వై ఎస్ సిలబస్ డెవలప్మెంట్ కన్సల్టెంట్ తుంబలి శివాజీ, ప్రకృతి వ్యవసాయ జిల్లా ఎన్. ఎఫ్. ఏ గొళ్ళ అన్నపూర్ణ, గోవింద రావు, మురళీ మోహన్, సునీల్, సన్యాసి రావు, దత్తి వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తొలిసారి శాసనసభకు నలుగురు

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర శాసనసభకు మన్యం జిల్లా నుంచి నాలుగు అసెంబ్లి నియోజకవర్గం ఉండగా నలుగురు కొత్తగా అసెంబ్లీకి అడుగుపెడుతున్నారు. జిల్లాలో కురుపాం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి మొదటిసారిగా పోటీ చేసి వైసిపి అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పాముల పుష్ప శ్రీవాణిని ఓడించి విజయాన్ని అందుకునీ తొలిసారి అసెంబ్లీకి అడుగుపెట్టనున్నారు. పాలకొండ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వి.కళావతిపై రెండు సార్లు నిమ్మల జయకృష్ణ టిడిపి నుండి పోటీ చేసి ఓడిపోయి ఇప్పుడు మూడోసారి జనసేన నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కళావతిపై పోటీ చేసి విజయోత్సం అందుకొని తొలిసారి అసెంబ్లీకి అడుగుపెట్టనున్నారు. పార్వతీపురం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసిన బోనెల విజయచంద్ర ప్రత్యర్థి అయిన సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావుపై గెలుపొంది తొలిసారి అసెంబ్లీకి అడుగుపెట్టనున్నారు. సాలూరు నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడక రాజన్న దొరపై గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన గుమ్మడి సంధ్యారాణి మూడుసార్లు టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయి మూడోసారి గెలుపొంది అసెంబ్లీకి మొట్టమొదటిసారి అడుగుపెట్టనున్నారు.

పబ్లికేషన్

మహారాజశ్రీ బొబ్బిలి అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు

O.S. 218/2022

బిట్వీన్ :

కెనరా బ్యాంకు, బొబ్బిలి రిప్రజెంటెడ్ మేనేజర్ బై బొబ్బిలి ..... వాది

ఎండ్:

M/S చెన్నై ఫ్యామిలీ రెస్టారెంటు & ఫాస్టు ఫుడ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ వగైరాలు .....ప్రతివాదులు

To,

D1. M/S%ఛెన్నై ఫ్యామిలీ రెస్టారెంటు & ఫాస్టు ఫుడ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ బొంగు సత్యన్నారాయణ తండ్రి శివున్నాయుడు కాపువీధి, పెద్దపెంకి గ్రామం, బలిజిపేట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

పై నెంబరు దావాలోని యిందలి ప్రతివాదుల పై సొమ్ము రాబట్టే నిమిత్తం దావా దాఖలు చేసియున్నాను. సదరు దావా వాయిదా **తేదీ. 19-06-2024వ** కి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా యీ దినం పై కోర్టులో **ఉదయం 10.30 గం॥**లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని కోర్టులో హాజరు కావలెయును లేని యెడల మీ పరోక్షమందు తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

బై ఆర్డరు

పి. మణికేశ్వర సాయి

వాది తరుపు అడ్వకేట్ బొబ్బిలి

బొబ్బిలి

తేది 3-6-2024

పబ్లికేషన్

మహారాజశ్రీ పార్వతీపురం 2వ అదనపు జిల్లా జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు

I.A.674/2022 in I.A.673/2022 in I.A.669/2022 in O.S.30/2018

బిట్వీన్

మరగానే విజయగౌరి ....పిటిషనరు/వాది.

ఎండ్

భాస్కర అప్పారావు వగైరాలు ....రెస్పాడెంట్లు/ప్రతివాదులు

TO,

R21. భాస్కర గోవిందమ్మ భర్త లేటు రమణ వయస్సు 53 సం॥లు, పున్నపురెడ్డి వీధి, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా

R22. భాస్కర వెంకట గంగు తండ్రి లేటు రమణ, వయస్సు 36 సం॥లు, పున్నపురెడ్డి వీధి, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా.

R22. మాయన పెన్న భర్త పాని కుమార్, తండ్రి లేటు రమణ, 30 సం॥లు, పున్నపురెడ్డి పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో యిందలి ప్రతివాదుల పై వాటా కోరే నిమిత్తం దావా దాఖలు చేసి యున్నాను. సదరు దావాలో యిందలి రెస్పాడెంటు నెం.3 తేది. 03-07-2021న కాలం చేసి యున్నారు. సదరు దావాలో చనిపోయిన 3వ ప్రతివాది యొక్క వారసులను చేర్పించమని ఐ.ఎ.674/2022 ఎల్.ఆర్ పిటిషను ఐ.ఎ.673/2022 ఎబైట్‌మెంటు పిటిషను మరియు ఐ.ఎ.669/2022 సెక్షన్ '5' పిటిషన్లు దాఖలు చేసియున్నాను. సదరు దావా వాయిదా **తేది.20-06-2024** వున్నది. సదరు వాయిదా యీ దినం పై కోర్టులో **ఉదయం 10.30 గం॥**లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరు కావలెయును లేని యెడల మీ పరోక్షమందు తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

బై ఆర్డరు

పి. మణికేశ్వర సాయి

వాది తరుపు అడ్వకేట్ బొబ్బిలి

బొబ్బిలి,

తేది: 5.6.2024